'నిఘా' నిస్తేజం

- కాజీపేటలో పనిచేయని సీసీ కెమెరాలు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- నేరాల ఛేదనలో జాప్యం


ప్రధాన రహదారిపై పని చేయని సీసీ కెమెరాలు


చోరీలు, నేరాల గుర్తింపులో జాప్యం

కాజీపేట: కాజీపేట పట్టణ పరిధిలో ఏర్పాటు చేసిన పలు సీసీ కెమెరాలు నిర్వీర్యంగా మారాయి. రెండేళ్ల క్రితం పలువురు దాతల చేయూతతో లక్షలాది రూపాయల వ్యయంతో పట్టణంలోని పలు ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ప్రధాన రహదారులతో పాటు అనేక కాలనీల్లో ఏర్పాటు చేసిన కెమెరాల్లో 70శాతం కెమెరాలు పని చేయడం లేదు. వాటి నిర్వహణ బాధ్యతను స్వీకరించిన పోలీసు అధికారులు.. పనుల ఒత్తిడి కారణంగా కెమెరాల మరమ్మతుకు ప్రయత్నించకపోవడంతో సమస్య తీవ్రత నానాటికి పెరుగుతోంది.

కొరవడిన పర్యవేక్షణ

పట్టణ పరిధిలోని ప్రధాన రహదారులు, ప్రశాంత్‌నగర్ కాలనీ, సిద్ధార్థనగర్, సోమిడిరోడ్డు, ఫాతిమానగర్ తదితర ప్రాంతాల్లో దాదాపు 250కి పైగా సీసీ కెమెరాలను బిగించారు. అయితే, వాటి పర్యవేక్షణ కొరవడటంతో సీసీ కెమెరాలు పలు ప్రాంతాల్లో పని చేయడం లేదు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పాటు వివిధ కారణాలతో దెబ్బతిన్న సీసీ కెమెరాలను రిపేర్ చేయించడానికి ఎవరూ చొరవ చూపించకపోవడంతో వాటి పనితీరు అటకెక్కింది. పలు కూడళ్లలో ఉన్న సీసీ కెమెరాలు విరిగిపోయి స్తంభాలకు వేలాడుతున్నాయి. సీసీ కెమెరాలు పని చేసిన క్రమంలో పట్టణంలో నేరాల సంఖ్య క్రమేణా తగ్గిపోయింది. నేరం జరిగిన కొద్దిరోజుల్లోనే అనేక కేసులను పోలీసులు సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా ఛేదించి ఉన్నతాధికారులతో ప్రశంసలు దక్కించుకున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. ప్రధాన రహదారులన్నీ పోలీసుస్టేషన్‌లో అనుసంధానమై ఉన్నాయి. అయితే, సీసీ కెమెరాల్లో మూడొంతులకుపైగా పని చేయకుండా పోయాయి. ఫలితంగా పట్టణంలో ఇటీవల చోటు చేసుకుంటున్న వరుస ఘటనలైన ప్రమాదాలు, చోరీలు, హత్యలకు పాల్పడే వారిని గుర్తించే వీలు లేకుండాపోయింది. దీంతో ఉన్నతాధికారుల లక్ష్యం నెరవేరకుండా పోతోంది. ప్రజల భాగస్వామ్యంతో సీసీ కెమెరాలను అధికారులు వినియోగంలోకి తీసుకువచ్చి పట్టణాన్ని నిఘా నీడలో ఉంచాలని పలువురు కోరుతున్నారు. దీంతో నేరాల సంఖ్య గణనీయంగా తగ్గే అవకాశం ఉంది.

క్లుప్తంగా

తపాలా ఖాతాను తీసుకోండి

ఖిలా వరంగల్: ప్రభుత్వ పథకాలకు అర్హులైన ప్రతిఒక్కరూ పోస్టాఫీసుల్లో సేవింగ్ ఖాతాను తీసుకోవాలని వరంగల్ తపాలాశాఖ డివిజనల్ సూపరింటెండెంట్ ఎస్‌వీఎల్ ఎన్.రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖాతా ఓపెన్ చేసిన వారికి పాసుపుస్తకం, ఏటీఎం కార్డు అందజేస్తామని తెలిపారు. కార్డు నంబర్‌తో ఆన్‌లైన్ లావాదేవీలు కూడా చేసుకోవచ్చని వివరించారు.

లేజర్ ట్రీట్‌మెంట్‌పై అవగాహన

నయీంనగర్: లేజర్ ట్రీట్‌మెంట్‌పై మహిళలు, బ్యూటీషియన్లకు నయీంనగర్ అరోమా హోటల్‌లో గురువారం ఉచిత సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రైనర్ ముబీనా సాహెబ్‌ఖాన్ పాల్గొని లేజర్ హెయిర్ రిమూవల్, మైక్రోబ్లేడింగ్, కొరియన్ ఫేషియల్ లాంటి అధునాతన పద్ధతులను నేర్పించారు. కార్యక్రమ నిర్వాహకులు ఏహెచ్ బ్యూటీ అకాడమీ డైరెక్టర్ మండరి రాంప్రతాప్ మాట్లాడుతూ బ్యూటీ రంగంలో ఆధునిక పద్ధతులను నేర్చుకొని స్వశక్తితో ఉన్నతమైన జీవితం గడపాలనే ఉద్దేశంతో ఉచితంగా సెమినార్ నిర్వహించినట్లు చెప్పారు. హీరా, ప్రత్యూష, కల్పన, శివరంజని, బ్యూటీషియన్లు పాల్గొన్నారు.

ఎఫ్‌టీఎల్‌లో అక్రమ నిర్మాణాలు

వరంగల్ అర్బన్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బల్దియా టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది విధుల్లో నిమగ్నకావడంతో వరంగల్‌లోని కోట చెరువు, చిన్నవడ్డేపల్లి చెరువుల ఎఫ్‌టీఎల్ పరిధిలో అనుమతులు లేని భవనాలు విచ్చలవిడిగా వెలిసినట్లు ఆక్రమణ ఏరియాల పరిరక్షణ సొసైటీ అధ్యక్షుడు పెరుమాండ్ల లక్ష్మణ్ తెలిపారు. అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈమేరకు బల్దియా ప్రధాన కార్యాలయంలో కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషాను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఎఫ్‌టీఎల్ పరిధిని కబ్జా చేసి భవనాలు, ప్రహరీ, గదులను నిర్మించారని పేర్కొన్నారు. కోటచెరువు, వడ్డేపల్లి చెరువులు ఆక్రమణలతో కుదించుకుపోయినట్లు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

మడికొండ: గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, నిలిచిపోయిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. ఈమేరకు వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజును గ్రామానికి చెందిన పార్టీ నాయకులు హైదరాబాద్‌లో గురువారం కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పార్టీ కాజీపేట మండల అధ్యక్షుడు తొట్ల రాజుయాదవ్ మాట్లాడుతూ మెట్టుగుట్ట ఆలయంపై, గ్రామంలో నిలిచిపోయిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలని కోరారు. డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో వస్కుల శంకర్, కొప్పుల నవీన్ యాదవ్, తండ శివ, శామిల్, పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోండి

నయీంనగర్: ఇటీవల దామెర గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందిన ఎలక్ట్రీషియన్ కిషన్ కుటుంబాన్ని ఆదుకోవాలని టీఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు బొట్ల భిక్షపతి మాదిగ, బాధిత కుటుంబ సభ్యులు కోరారు. ఈమేరకు ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు వేడుకున్నారు. కుటుంబ పెద్దను కోల్పోయి కడుపేదరికంలో ఉన్న కుటుంబ సభ్యులను ఆదుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

రాజ్యాధికారంలో చోటివ్వండి

నయీంనగర్: గత ప్రభుత్వం దళిత క్రైస్తవులను నిర్లక్ష్యం చేసి ప్రాధాన్యం ఇవ్వకుండా అణిచివేసిందని, పేదలు, బడుగు, బలహీన వర్గాలకు అండగా ఉండే కాంగ్రెస్ పార్టీ.. దళిత క్రైస్తవులకు రాజ్యాధికారంలో చోటివ్వాలని తెలంగాణ రాష్ట్ర దళిత క్రైస్తవ సంఘం అధ్యక్షుడు విశ్రాంత ప్రొఫెసర్ జాన్సన్ కోరారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

పెన్షనర్స్ అసోసియేషన్ ఎన్నిక

దేశాయిపేట: వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని పెన్షనర్స్ అసోసియేషన్ దేశాయిపేట యూనిట్ కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గిన్నారం బాబు, ఉపాధ్యక్షుడిగా జన్ను మాణిక్యం, కార్యదర్శిగా సమ్మయ్య, కోశాధికారిగా సుధాకర్‌తో పాటు 11మందిని సభ్యులు ఎన్నికయ్యారు.

తాళం పగులగొట్టి ఇంట్లో చోరీ

కాజీపేట: తాళం వేసి ఉన్న ఇంటిలో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి సుమారు రూ.2 లక్షల విలువ గల వస్తువులను అపహరించుకెళ్లిన ఘటన గురువారం తెల్లవారుజామున వెలుగు చూసింది. బాధితుడు కంటి శ్రీనివాస్ కథనం ప్రకారం ఇంటికి తాళం వేసి ఊరుకు వెళ్లి వచ్చేసరికి తాళం పగులగొట్టి దుండగులు చోరీకి పాల్పడ్డారు. నగదు, బంగారం, వెండి వస్తువులు అపహరించుకెళ్లారని ఫిర్యాదు చేయగా పోలీసులు విచారణ చేస్తున్నారు.

బీడీ కార్మికులకు వర్తింపజేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఖాసీం

వరంగల్ చౌరస్తా: బీడీ కార్మికులకు సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని ఉమ్మడి వరంగల్ జిల్లా బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ.ఖాసీం డిమాండ్ చేశారు. వరంగల్ లక్ష్మీపురంలో బీడీ వర్కర్ల సమావేశం శ్రీహరి అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఖాసీం మాట్లాడుతూ గత ప్రభుత్వం అనేక వాగ్దానాలు చేసి ఓటమి పాలైందని విమర్శించారు. బీడీ కార్మికుల డిమాండ్లను కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. కనీస వేతనాలు అమలు చేయాలని, కార్మికులకు జీఎస్టీ ఎత్తివేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసే ప్రయత్నాలను మానుకోవాలని ఖాసీం వేడుకున్నారు. రిటైర్‌మెంట్ పొందిన కార్మికులకు నెలకు రూ.7 వేల చొప్పున పింఛన్ అందజేయాలని కోరారు. ఈ సమావేశంలో వర్కర్స్ యూనియన్ నాయకులు బహదూర్, షేక్ షహజాదీ, సుగుణ, సంధ్య, బీడీ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలతో విజ్ఞానం పెంపు


ప్రవీణ్‌కు పుస్తకాలు అందజేస్తున్న రమేశ్, స్వామి

హన్మకొండ: పుస్తకాలతో విజ్ఞానం పెరుగుతుందని రౌతు మనోహర్ ట్రస్టు ప్రతినిధి, దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు రౌతు రమేశ్‌కుమార్ తెలిపారు. చెన్నారావుపేట మండలంలోని లింగగిరి గ్రామంలోని గ్రంథాలయం కోసం నిర్వాహకుడు బర్ల ప్రవీణ్‌కు ఆ ట్రస్టు ఆధ్వర్యంలో ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎర్రగట్టు స్వామి చేతుల మీదుగా రూ.5 వేల విలువైన పోటీ పరీక్షల పుస్తకాలను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా రమేశ్‌కుమార్ మాట్లాడారు. పోటీ పరీక్షలను ఎదుర్కొనేందుకు, విజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి పుస్తకాలు దోహదపడతాయని చెప్పారు. శ్వాస ఉన్నంత వరకు పేదల కోసం పోరాడిన తన తండ్రి మనోహర్ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ట్రస్టు ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అనంతరం, ప్రొఫెసర్ ఎర్రగట్టు స్వామి మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపయోగపడేలా పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను లైబ్రరీకి అందజేయడం అభినందనీయమని ఆయన తెలిపారు.

రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలి


నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు


కాశిబుగ్గ: రాజ్యసభ చైర్మన్, భారత ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌ను అవహేళన చేసిన కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్‌గాంధీ వెంటనే క్షమాపణ చెప్పాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు కాశిబుగ్గ జంక్షన్‌లో గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు జరగగా మూడు రాష్ట్రాల్లో బీజేపీ విజయం సాధించడంతో, అది చూసి తట్టుకోలేని కాంగ్రెస్, దాని మిత్ర పక్షాలు దేశంలోని అసాంఘిక శక్తులతో కలిసి భారత పార్లమెంట్ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో వన్నాల శ్రీరాములు, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, కుసుమ సతీష్, బాకం హరిశంకర్, సముద్రాల పరమేశ్వర్, గంటా రవికుమార్, డాక్టర్ వన్నాల వెంకటరమణ, కనుకుంట్ల రంజిత్, సిద్దం నరేష్, రఘునారెడ్డి, గడల కుమార్, బండి సుజాత, బైరి శ్యామ్, సుమన్ కత్రి, గోవింద్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

'చలో పార్లమెంట్'ను విజయవంతం చేయాలి


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

విద్యారణ్యపురి: దేశ ప్రజలందరికీ ఉచిత విద్య, ఉపాధి కల్పనకు భారతీయ విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ), 16 లౌకిక విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జనవరి 12న నిర్వహించనున్న చలో పార్లమెంట్ ముట్టడిని విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ పిలుపునిచ్చారు. ఈ మేరకు నగరంలోని అశోక జంక్షన్ సమీపంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో కలిసి వాల్‌పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ గడిచిన పదేళ్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగానికి అత్యంత తక్కువగా నిధులు కేటాయించినట్లు ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విద్యావిధానం అమలైతే చదువు కొనుక్కునే దుస్థితి నెలకొంటుందని ఆరోపించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి స్టాలిన్, కమిటీ సభ్యులు జస్వంత్, కార్తీక్, పవన్, చరణ్, రాజ్‌కుమార్, ప్రవళిక, అనూష, మానస, వైష్ణవి పాల్గొన్నారు.

ఘనంగా సీపీఐ ఆవిర్భావ దినోత్సవం


జెండాను ఎగురవేస్తున్న నేదునూరి జ్యోతి

హసన్‌పర్తి: సీపీఐ 99వ ఆవిర్భావ దినోత్సవాన్ని హసన్‌పర్తి మండలం మడిపల్లిలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి మాట్లాడుతూ సమీకృత పోరాటాలను నిర్వహించడం వల్ల మతోన్మాద శక్తులను నిరోధించవచ్చని అన్నారు. తద్వారా సోషలిజాన్ని ఏర్పాటు చేసుకోవచ్చని పిలుపునిచ్చారు. తొలుత పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు మోతె లింగారెడ్డి, జిల్లా కమిటీ సభ్యుడు రాజమౌళి, మడిపల్లి సర్పంచ్ చిర్ర సుమలత, ఎంపీటీసీ సభ్యుడు ఇంద్రయ్య, నాయకులు సాంబరాజు, సమ్మయ్య, సుధాకర్, దామెర లింగయ్య, కేశబోయిన లింగయ్య, జక్కు ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్లకు డాక్టరేట్


మురళీధర్


పావని

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ ప్రభుత్వ పాలనాశాస్త్రం విభాగంలో పరిశోధకుడు బీ.మురళీధర్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారు. విద్యాహక్కు చట్టం -2009 అమలులో పాఠశాల యాజమాన్య కమిటీల పాత్ర - వరంగల్ జిల్లా ఒక పరిశీలన అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథాన్ని ప్రొఫెసర్ పీ.నరసింహారావు పర్యవేక్షణలో సమర్పించినందుకు మురళీధర్‌కు డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు కాకతీయ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి తెలిపారు. అలాగే, కాకతీయ యూనివర్సిటీలో కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగంలో పరిశోధకురాలుగా మహిళా సాధికారిత మైక్రోఫైనాన్స్, సంస్థల ప్రభావం ఒక అధ్యయనం అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి పావనికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి తెలిపారు.

లారీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పదవికి రాజీనామా

వరంగల్: వరంగల్ లారీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎండీ.అఫ్జల్‌మియా తన పదవికి రాజీనామా చేసినట్లు అధ్యక్షుడు వేముల భూపాల్ తెలిపారు. ఆరెపల్లిలో గురువారం జరిగిన సమావేశంలో భూపాల్ మాట్లాడుతూ తన ఆరోగ్యం సహకరించపోవడంతో పదవికి రాజీనామా చేస్తున్నట్లు అఫ్జల్‌మియా తన రాజీనామా లేఖలో పేర్కొన్నారని వివరించారు. ఇటీవల జరిగిన సర్వసభ్య సమావేశంలో రాజీనామాను ఆమోదించినట్లు చెప్పారు. నూతన ప్రధాన కార్యదర్శి ఎన్నిక కోసం వారం రోజుల్లో సర్వసభ్య సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకుంటామని భూపాల్ తెలిపారు. సమావేశంలో అసోసియేషన్ నాయకులు ఎండీ.జాకీర్, ఎండీ.లాలు, హుస్సేన్, రాజు, రాజయ్య, లారీ ఓనర్లు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం


రక్తదాన శిబిరంలో పాల్గొన్న తెలంగాణ జగన్ సేన నాయకులు

వరంగల్: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని నగరంలోని పోచమ్మమైదాన్ చౌరస్తాలో జగన్ సేన ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ జగన్ సేన నాయకులు జన్ను శ్రీనివాస్, అభినయ్, గణేష్, కొత్తకొండ అరుణ్, అమర్లపూడి శ్రావణ్, బుగ్గ ప్రేమ్, జన్ను సుధీర్ పాల్గొన్నారు.

జాతీయ కన్స్యూమర్ డేకు చక్రపాణి, సుదర్శన్

వరంగల్: జాతీయ వినియోగదారుల హక్కుల దినం సందర్భంగా ఈనెల 24నుంచి రెండు రోజుల పాటు ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వం నిర్వహించనున్న 'వినియోగదారుల దినోత్సవం' జాతీయ సదస్సులో రాష్ట్రం నుంచి వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి, సీసీఐ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచర్ల సుదర్శన్ పాల్గొననున్నారు. ఈమేరకు వినియోగదారుల హక్కుల పరిరక్షణకు వినియోగదారుల చార్టర్‌ను విడుదల చేయనున్నట్లు వారు పేర్కొన్నారు.

సీనియర్ సిటిజన్ల సేవలు అభినందనీయం


మాట్లాడుతున్న రాధికా గుప్త

హసన్‌పర్తి: గ్రామాల్లో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ చేపడుతున్న సేవలు అభినందనీయమని హనుమకొండ అదనపు కలెక్టర్ రాధికా గుప్త అన్నారు. నగరంలోని రెండవ డివిజన్ గుండ్లసింగారంలో అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆయుర్వేద బోధనాస్పత్రి సహకారంతో గురువారం ఉచిత ఆయుర్వేద శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యం వల్ల ఎలాంటి దుష్ప్రభావాలు సంభవించవని చెప్పారు. ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా సంక్షేమశాఖ అధికారి మధురిమ మాట్లాడుతూ వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు ఆయుర్వేద వైద్యంతో ఆరోగ్య జీవనాన్ని గడపాలని సూచించారు. ఈ సందర్భంగా ఉచిత మందులు పంపిణీ చేశారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దామెర నర్సయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ రవినాయక్, డాక్టర్ జగన్మోహనాచారి, డాక్టర్ మైదం రాజు, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తేరాల యుగంధర్, సభ్యులు నాగులగాం నర్సయ్య, గోకారపు రాజేందర్, మలహార్‌రావు, పిట్టల సాంబయ్య, గంటి సాంబయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అండగా ఉంటాం..


మల్లికాంబ సిబ్బందితో కంపెనీ సీఈఓ, సభ్యులు

హన్మకొండ అర్బన్: మానసిక దివ్యాంగులకు హైదరాబాద్‌కు చెందిన కార్ బాక్స్ డిటైలింగ్ స్టూడియో సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయని కంపెనీ సీఈఓ సంగీత్ శ్రీపతి అన్నారు. నగరంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రాన్ని కంపెనీ ప్రతినిధులతో కలిసి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా సంగీత్ శ్రీపతి మాట్లాడుతూ తాను చిన్నతనం నుంచి అనేక కష్టాలకు ఓర్చి ఈ స్థాయికి వచ్చానని తెలిపారు. ఈ దివ్యాంగ పిల్లలను చూసి తరువాత తన కష్టం ఎంతో చిన్నదిగా కనిపించిందని అన్నారు. దివ్యాంగులైన చిన్నారులకు సేవ చేస్తున్న కేంద్రం నిర్వాహకులు, సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో కార్ బాక్స్ కంపెనీ సభ్యులు లావణ్య, లోకేష్, వినోద్, శర్మ, మల్లికాంబ నిర్వాహకులు బండా రామలీల, కోడం కల్యాణ్, ప్రొఫెసర్ పద్మ, సదానందం పాల్గొన్నారు.

సఖి సేవలను వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న వినీల

హన్మకొండ: లైంగిక, మానసిక వేధింపులకు గురయ్యే బాలికలు, మహిళలు సఖి వన్‌స్టాప్ కేంద్రం సేవలను వినియోగించుకోవాలని సఖి కేంద్రం కేస్ వర్కర్ వినీల సూచించారు. హనుమకొండ 5వ డివిజన్‌లోని కొత్తూరు కమ్యూనిటీ హాల్‌లో మహిళా చట్టాలు, న్యాయ సేవలు అనే అంశంపై గురువారం అవగాహన కల్పించారు. సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వినీల మాట్లాడారు. మనస్పర్ధలతో విడిపోయే భార్యాభర్తలను కౌన్సిలింగ్ ద్వారా ఒకటిగా చేయడం, వరకట్న వేధింపులు, లైంగిక వేధింపులకు గురయ్యే బాలికలు, మహిళలకు న్యాయ, పోలీసు సాయం అందించేందుకు కృషి చేస్తామని వివరించారు. 0870 -2452112, లేదా టోల్ ఫ్రీ నంబర్ 181లో సంప్రదించాలని కోరారు. సదస్సులో పారామెడికల్ ఎస్.కరుణ, మెప్మా సీఓ సునీల్, మహిళలు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితం చిత్తు


సదస్సులో మాట్లాడుతున్న ఎస్సై రాజబాబు

మడికొండ: మత్తు పదార్థాల వినియోగంతో జీవితం చిత్తవుతుందని, అలాంటి వాటికి విద్యార్థులు దూరంగా ఉండాలని మడికొండ ఎస్సై రాజబాబు సూచించారు. మత్తు పదార్థాల వాడకం వల్ల కలిగే దుష్పరిణామలపై మడికొండలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు, డ్రగ్స్, గుట్కా వంటి పొగాకు ఉత్పత్తులకు బానిస కాకూడదని చెప్పారు. ఆత్మవిశ్వాసంతో చదివి జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ చారి, ఎస్సై దివ్య, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్ పొగతో ఇబ్బందులు

జాతీయ రహదారిపై మడికొండ వాసుల ధర్నా


మడికొండ చౌరస్తాలో ధర్నా చేస్తున్న స్థానికులు

మడికొండ: డంపింగ్ యార్డ్ పొగతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మడికొండ గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈమేరకు గురువారం రాత్రి జాతీయ రహదారిపై బైటాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డంపింగ్‌యార్డ్ నుంచి వెలువడే హానికరమైన పొగతో పిల్లల నుంచి పెద్దల వరకు తీవ్ర శ్వాసకోశ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపి డంపింగ్ యార్డ్ సమస్యలకు పరిష్కారం చూపాలని కోరారు. ధర్నాతో ట్రాఫిక్ నిలిచిపోయింది. దాంతో అక్కడికి పోలీసులు చేరుకుని ధర్నాను విరమింపజేశారు. ధర్నాలో గడ్డం మహేందర్, ఎలగొండ శివ, యువకులు, స్థానికులు పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు మార్గాన్ని అనుసరించాలి


క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న వినయ్‌భాస్కర్


ఎంజీఎం: కేక్ కట్ చేస్తున్న ఉద్యోగులు

కాజీపేట రూరల్: ఏసుక్రీస్తు చూపిన మార్గంలో ప్రతిఒక్కరూ నడిచి ఆయనను అనుసరించాలని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. కాజీపేట 47వ డివిజన్ బాపూజీనగర్ సిద్దు టెంట్ హౌజ్ వద్ద పార్టీ అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గబ్బెట శ్రీనివాస్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను గురువారం నిర్వహించారు. పాస్టర్ జాషువా ప్రార్థన చేయగా, ముఖ్యఅతిథిగా వినయ్‌భాస్కర్ మాట్లాడారు. ప్రపంచంలో అధిక జనాభా ఆరాధించేది ఏసుక్రీస్తునేనని కొనియాడారు.

ఎంజీఎంలో ప్రీక్రిస్మస్ వేడుకలు

ఎంజీఎం: ఎంజీఎం ఆస్పత్రిలో ప్రజారోగ్య, వైద్య ఉద్యోగుల సంఘం ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో ప్రీక్రిస్మస్ వేడుకలను గురువారం నిర్వహించారు. బ్రాంచ్ అధ్యక్షురాలు గద్దల ప్రేమలత, ప్రధాన కార్యదర్శి శాంతకుమారి ఆధ్వర్యంలో ఉద్యోగులు కేక్ కట్ చేశారు. ముఖ్యఅతిథిగా ఆర్ఎంఓ మురళి, సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొప్పు ప్రసాద్ హాజరై ఉద్యోగులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

వైభవంగా అయ్యప్ప నగర సంకీర్తన

ఖిలా వరంగల్: వరంగల్ శంభునిపేట, రంగశాయిపేటలోని మహంకాళి దేవాలయ ప్రాంగణంలో అయ్యప్ప సేవా పరపతి సంఘం అధ్యక్షుడు కొల్లూరి యోగానంద్ గురుస్వామి ఆధ్వర్యంలో కొండ్రెడ్డి నవీన్ రెడ్డి నేతృత్వంలో గురువారం రాత్రి నగర సంకీర్తన నిర్వహించారు. అంతకుముందు అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రత్యేకంగా తయారు చేసిన రథంపై అయ్యప్ప ఉత్సవ విగ్రహాన్ని ప్రతిష్ఠించి శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీధర్, బజ్జూరి వీరేశం, అనుమాండ్ల రమేష్, నల్లతీగల వెంకన్న, కరుణాకర్, కన్నె స్వాములు, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

కాజీపేటలో అయ్యప్ప పడిపూజ

కాజీపేట: కాజీపేట పట్టణంలో భక్తుల శరణుఘోషల మధ్య అయ్యప్ప పడిపూజను గురువారం నిర్వహించారు. అయ్యప్ప ఉత్సవ విగ్రహానికి అయ్యప్ప ఆలయ అర్చకుడు శ్రీనివాస్‌శర్మ పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు జరిపించారు. 18 మెట్ల పూజ పూర్తికాగానే స్వాముల శరణు ఘోషలతో పుర వీధులు మారుమోగాయి. పూజలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

'ఆర్ట్స్' విద్యార్థుల క్షేత్ర పర్యటన



కేయూ క్యాంపస్: యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల బీఏ ఫైనల్ ఇయర్ విద్యార్థులు క్షేత్ర పర్యటనలో భాగంగా కాళేశ్వరంలోని అన్నారం, సరస్వతి బ్యారేజీలు, రామప్పలోని రుద్రేశ్వరాలయాన్ని గురువారం సందర్శించారు. గోదావరి నదిపై నిర్మించిన సరస్వతి బ్యారేజీ, లక్ష్మి పంప్‌హౌజ్ నిర్మాణం, రామప్ప దేవాలయ నిర్మాణం, రుద్రేశ్వరాలయం, రామప్ప చెరువు కట్టడం గురించి అక్కడి గైడ్‌ల ద్వారా వివరాలు తెలుసుకున్నారు. విద్యలో భాగంగా క్షేత్ర పర్యటనలో పాల్గొంటే విద్యార్థులకు ప్రత్యక్ష అనుభూతి కలుగుతుందని కళాశాల అర్థశాస్త్ర విభాగం ఇన్‌చార్జ్ హెడ్ డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోథ్, డాక్టర్ లక్ష్మీనారాయణ, రమేష్, దాస్ తెలిపారు.